క్లుప్తంగా

'నో బ్యాగ్ డే'



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీజ్ పండగ అనే పాఠ్యాంశంలో భాగంగా గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, సాంస్కృతిక ప్రదర్శనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆ పాఠ్యాంశానికి సంబంధించిన కృత్యం విద్యార్థులతో చేపట్టారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.అచ్యుతరావు, ఉపాధ్యాయులు పి.చంద్రకళ, బి.వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఉపాధి పనులు



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో సాయిరాం

రాజాం: మండలంలోని కంచరాం, గడిముడిదాం, శ్యాంపురం, బొద్దాం తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయని ఏపీవో సాయిరాం తెలిపారు. గడిముడిదాం గ్రామంలో జరుగుతున్న ఈ పనులను శనివారం పరిశీలించిన ఆయన వేతనదారులకు గిట్టుబాటు వేతనం వచ్చేలా పనులు ఎలా చేయాలో వివరించారు. రెండు పూటలా పని చేయించాలని, వేతనదారులకు కోరినచోట కోరిన వెంటే పనులు కల్పించాలన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



మారేడుబాకలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్

రాజాం: మండలంలోని మారేడుబాక గ్రామంలో ప్రభుత్వం అందించిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ చేతులమీదుగా లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా రూ.25 లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందే సువర్ణావకాశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాసూరి శంకరరావు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



వివిధ ప్రశ్నలడిగి విద్యార్థి విద్యాసామర్థ్యం పరిశీలిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

వంగర: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని కొనంగిపాడు గ్రామ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని, మెనూ ప్రకారం వారికి మధ్యాహ్న భోజనాలు పెట్టాలని సిబ్బందికి తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



వన్నలిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ రమణ

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు బ్లీచింగ్ చల్లారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో శ్యామలకుమారి తెలిపారు. వన్నలి గ్రామంలో శనివారం జరిగిన పారిశుద్ధ్య పనులను సర్పంచ్ గార రమణ పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

రాజాం సిటీ: గ్రామాల్లో మిగిలి ఉన్న విద్యుత్ మీటర్ల సర్వే, కులగణన, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన 15వ ఆర్థికసంఘం పీఎఫ్ఎంఎస్ పోర్టల్ నుంచి 2వ విడత నిధులు చెల్లింపులపై వివరాలు సమర్పించాలన్నారు. అలాగే ఇంటి పన్నుల వసూళ్లు, క్లాప్ మిత్రల పెండింగ్ జీతాల వివరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి.. సిద్ధం!



బొబ్బిలి: భీమిలి సభకు బయలుదేరుతున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా సిద్ధం పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతమైంది. విశాఖ జిల్లా, భీమిలి నియోజకవర్గం, సంగివలసలో శనివారం జరిగిన ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూనే మోసపూరిత హామీలతో ప్రతిపక్షాలు జనాలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని, 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో విజయం కోసం ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మేము సైతం సిద్ధమని పార్టీ శ్రేణుల నినాదాలతో సభాప్రాంగణం మార్మోగింది. – సాక్షి నెట్‌వర్క్.



తెర్లాం: సభకు వెళ్లే ముందు తెర్లాం మండలం నాయకులు, కార్యకర్తలతో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రేగిడిలో సభకు వెళ్తున్న బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



తెర్లాం మండలం నుంచి సభకు ఉత్సాహంగా బయలుదేరి వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



రామభద్రపురం: వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావ సభకు బయలుదేరిన రామభద్రపురం మండల నాయకులు



రాజాం నుంచి సభకు బయలుదేరిన వాహనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



బాడంగి: వైఎస్సార్ సీపీ జెండా రంగుల దుస్తులతో సభకు బయలుదేరిన పార్టీ వీరాభిమాని రమణ



వంగర: వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావ సభకు బస్సులో తరలివెళ్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు



రాజాం సిటీ: భీమిలి సిద్ధం సభకు స్వచ్ఛందంగా వెళ్తున్న గురవాం గ్రామస్తులు



సంతకవిటి: బస్సులో సభకు పయనమైన జేసీఎస్ కన్వీనర్ రమేష్‌నాయుడు, తదితరులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వెలగవలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు శనివారం పరిశీలించారు. తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్‌తో కలిసి ఆయన మండలంలోని కూనాయవలస, వెలగవలస తదితర గ్రామాల పోలింగ్ కేంద్రాలకు వెళ్లి, అక్కడి వసతులను గమనించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల పరిస్థితి ఏ విధంగా ఉందోనని తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎన్నికల వేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని గ్రామస్తులను కోరారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన ఏపీఎం గోవిందరావు

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం పి.గోవిందరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గ్రామైక్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా సంఘాల పొదుపు రికార్డులు పరిశీలించి, పొదుపు నిల్వలతో పాటు స్త్రీనిధి రుణాల వినియోగం, చెల్లింపులపై ఆరాతీశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సున్నా వడ్డీ రుణం, రుణమాఫీ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అంబాడలో జగనన్న ఆరోగ్య సురక్ష



రోగి సమస్య విని, ప్రిస్క్రిప్షన్ రాస్తున్న వైద్యుడు కల్యాణబాబు

రేగిడి: మండలంలోని అంబాడ గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ దార అప్పలనరసమ్మ, సర్పంచ్ చుక్క వెంకటనాయుడు కలిసి ప్రారంభించారు. వైద్యుడు కల్యాణబాబు రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా కులగణన



మండాకురిటిలో కులగణన సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే పక్కాగా జరుగుతోంది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ నిబంధనల మేరకు వివరాలను పారదర్శకంగా సేకరిస్తున్నారు. మండాకురిటి గ్రామంలో శనివారం జరిగిన సర్వేలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి, వారి కులం, ఆర్థిక, సామాజిక స్థితిగతుల వివరాలు అడిగి, తెలుసుకున్నారు. పేదలకు మరింత న్యాయం జరుగుతుందని, సమాజ సమతుల్యతకు ఇది ఉపకరిస్తుందన్న సదుద్దేశ్యంతోనే ఈ సర్వే చేయడం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

బాడంగి: స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమావేశమై, పలు సూచనలు చేశారు. కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఆంజనేయులును ఆదేశించగా, ఇప్పటికే 80 శాతం మేర సర్వే పూర్తయిందని ఎంపీడీవో తెలిపారు. మూడు రోజుల్లోగా ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వాడాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ, తహసీల్దార్ రఫీజాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ రేపు

బొబ్బిలి: స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9490610123, 9492666989ను సంప్రదించాలని కోరారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

జామి: మండలంలోని ఏ.ఆర్.పేట పంచాయతీ పుష్పగిరి గ్రామం లోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానఅర్చకులు ఫణిహారం సీతారామాచార్యులు స్వామి వారిని వివిధ పుష్పాలు, తులసీదళమాలలతో విశేషంగా అలంకరించారు. స్వామివారికి భక్తులతో పూజలు,అభిషేకాలు చేయించారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ రత్నకుమార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తెర్లాం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న తెర్లాం తహసీల్దార్ బి.రత్నకుమార్‌ను కార్యాలయ అధికారులు, సిబ్బంది, వీఆర్‌వోలంతా కలిసి శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ సేవలకు గాను తహసీల్దార్‌కు ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని ఉప తహసీల్దార్ జి.భాస్కరరావు అన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌వో నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: రిపబ్లిక్ డే వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ నాగలక్ష్మి చేతులమీదుగా అవార్డు అందుకున్న రాజాం వైఎస్సార్ క్రాంతి పథం ఏపీ ఎ.చిరంజీవిని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, వలువురు వైకేపీ ఉద్యోగులు శనివారం సన్మానించారు.

చెరువు ఆక్రమణ!



చెరువు స్థలంలో ఆక్రమణదారుడు వేసిన సిమెంట్ స్తంభాలు, కంచెను చూపిస్తున్న సీపీఎం కార్యదర్శి సురేష్

బాడంగి: కోడూరు రెవెన్యూ పరిధిలోని రామచంద్రాపురం వద్ద ఓ వ్యక్తి మామిడితోటకు ఆనుకుని ఉన్న చెరువు స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ ఆరోపించారు. శనివారం ఆక్రమిత ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన ఆక్రమణ విషయం వీఆర్‌వోకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్రమణదారుడు ఆక్రమించుకున్న ప్రదేశంలో ఇప్పటికే సిమెంట్ స్తంభాలు వేసి, కంచె కూడా వేశారన్నారు. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించే వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ పథకం వేతనదారులకు దారి లేకుండా పోయిందన్నారు. సర్వే నంబర్ 110లో 7 ఎకరాలు, సర్వే నంబర్ 117లో 8 ఎకరాల వరకు ప్రభుత్వ చెరువులు ఉన్నప్పటికీ ఆక్రమణదారు వాటిని ఆక్రమించాలని చూస్తున్నాడని, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా చెరువుల్లో దాదాపు 14.14 ఎకరాల వరకు కబ్జాకు గురైందన్నారు. ఇదే ఘటనపై స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసి, విషయం తెలియజేశామన్నారు. ఇదే విషయాన్ని తహసీల్దార్ వద్ద ప్రస్తావించగా, అక్కడి చెరువు భాగంలో కొంతమేర సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి, కంచె వేసినది వాస్తవమేనని, అయితే జిరాయితీలో ఉన్నవి వదిలేసి, ప్రభుత్వ స్థలంలో ఉన్న స్తంభాలు, కంచెను ఇప్పటికే తొలగించామన్నారు. అక్కడికి ఇన్‌చార్జ్ సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సోమన్నదొర, వీఆర్‌వో రామకృష్ణనాయుడును శనివారం పంపించి, కంచెను తొలగించి, కూలీల రాకపోకలకు వీలుగా దారి ఉండేలా చేశామన్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారెవరైనా చర్యలు తీసుకుంటామన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తెర్లాం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని, కిశోరి బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని తెర్లాం, కూనాయవలస అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, శ్రీదేవి, సునీత, విజయదుర్గ సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం ఉపయోగాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కిశోరి బాలికలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఆరోగ్యం బాగా ఉంచుకోవడంతో పాటు బాగా చదువుకోవాలని కోరారు.

వాహన తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, సంకిలి, బూరాడ ప్రాంతాల్లో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి అటువైపుగా వస్తున్న వాహనాలను తనిఖీ చేసి, ఏవైనా మత్తుపదార్థాల రవాణా జరుగుతుందా లేదా అనే విషయం పరిశీలించారు. అలాగే వాహనదారుల లైసెన్స్, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను సరిచూశారు. ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు, ముందు సీటులో కూర్చొనే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని తెలిపారు. అనంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి, మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు.

భగవద్గీత పఠనం మోక్షప్రదం



భగవద్గీత సారాంశం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత పఠనం మోక్ష ప్రదమని పాలకొండ ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతామందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను చదివితే జ్ఞానం, సన్మార్గంలో నడిచే అలవాటు పెంపొందుతాయన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతిఒక్కరికీ మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

రాజాం సిటీ: హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరిగిన సైన్స్ ప్రయోగ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన మండలంలోని కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను రాజాం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పాఠశాలలో శనివారం సత్కరించి, అభినందించారు. నేషనల్ సైన్స్ ఫెస్టివల్–స్టూడెంట్ సైన్స్ విలేజ్ పేరిట ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు జరిగిన పోటీల్లో కాంతి రుజుమార్గంలో ప్రయాణిస్తుందన్న అంశాన్ని ప్రయోగాత్మకంగా విద్యార్థులు పి.సౌజన్య, పి.శిరీష, పి.చరణ్, డి.దినేష్, పి.సత్యవతి వివరించారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు వసంతకుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు పి.చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.